





# కరపత్రం

SINCE 2014

ఆదివారం జనవరి 18, 2026 సంపుటి : 2 సంచిక : 103 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


# పాలమూరుకు న్యాయం చేస్తాం

## రూ. 1,284 కోట్లతో

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన





- పాలమూరు బిడ్డల శ్రమతోనే ప్రాజెక్టులు
- పాలమూరు అన్యాయం చేసిన కెసిఆర్
- బిఆర్ఎస్ పాలనలో ఉమ్మడి జిల్లాకు తీరని అన్యాయం
- పదేళ్లపాటు ప్రాజెక్టులు కట్టకుండా తీవ్ర నిర్లక్ష్యం
- జడ్చర్లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన
- జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పిన సిఎం రేవంత్

**మహబూబ్‌నగర్,జనవరి17 :** దేశంలో ఏ ప్రాజెక్టు కట్టినా.. వాటిలో పాలమూరు బిడ్డల శ్రమ దాగి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వారి చెమట అందులో ఉంటుందని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రూ. 1,284 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. దేశంలోనే అత్యంత వెనుకబడిన మండలం ఈ జిల్లాలోని గట్టు మండలం. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం పదేళ్లపాటు పాలమూరు జిల్లా ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది. కేసీఆర్ పదేళ్లపాటు పాలమూరు జిల్లాకు ఒక్క ప్రాజెక్ట కూడా తీసుకురాలేదని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును 2013లో అప్పటి కాంగ్రెస్ నేతలు సాధించారు. ప్రాజెక్టు పేరు మీద రూ. 23 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించారు కానీ, ప్రాజెక్టు పూర్తి చేయలేదు. ఉద్దండాపూర్ జలాశయం భూ నిర్వాసితులకు నిధులు చెల్లించలేదు. సంగంబండ వద్ద బండ పగుల గొట్టేందుకు కేసీఆర్ పదేళ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పదేళ్లపాటు నిర్లక్ష్యం చేశారు. గతంలో పాలమూరు జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. జిల్లాలోని ప్రాజెక్టుల గురించి అడగలేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చ పెడితే సభకు రాకుండా పారిపోయారని ఎద్దేవా చేశారు. భాజపా ఎంపీలు రాష్ట్రానికి ఐఐఎం సాధిస్తే.. పాలమూరు జిల్లాలోనే భూమి ఇచ్చే బాధ్యత నాదని అన్నారు. పాలమూరు జిల్లాను వెనకబడిన జిల్లాగా ఇంకా ఎన్నాళ్లు చూపించాలి? పదేళ్లలో రూ. 1.80లక్షల కోట్లు ఖర్చు చేశారు కానీ.. ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు ఒక్కటి పూర్తి చేశారు.. అది మూడేళ్లకే కుప్పకూలింది. పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేసే బాధ్యత నాది. ఇవాళ రాష్ట్రంలో 3.50 కోట్ల మంది పేదలకు రేషన్ కార్డులపై సన్న బియ్యం ఇస్తున్నాం. గతంలో పదేళ్ల పాటు పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. మారీచ, సుబాహులు ఏ రూపంలో వచ్చినా ఈ సారి ప్రజలు తరిమి కొడతారని సీఎం అన్నారు. భారత తొలి ప్రధాని నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులు, విద్యకే తొలి ప్రాధాన్యత ఇచ్చారని, తమ ప్రభుత్వం కూడా వాటికే ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

2లో..




2లో

## తృణమూల్‌ను సాగనంపే

# సమయం వచ్చింది

- » బెంగాల్ అభివృద్ధికి మమత ప్రధాన అడ్డంకి
- » చొరబాటుదారులకు తృణమూల్ అండతో నష్టం
- » అవినీతి కారణంగా ప్రజలకు చేరని పథకాలు
- » బీహార్ తరవాత ఇప్పుడు బెంగాల్ వంతు
- » మాల్దా సభలో తృణమూల్‌ను ఏకిపారేసిన ప్రధాని మోడీ

**కోల్‌కతా,జనవరి17 :** బెంగాల్ ప్రజల పట్ల ఏమాత్రం కనికరం లేని అధికార తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సాగనంపే సమయం వచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇక్కడి చొరబాట్లకు తృణమూల్ అండగా నిలవడం పెద్ద సమస్యగా మారిందన్నారు. బీజేపీ అభివృద్ధి మోడల్‌ను జెన్‌జీ తరం విశ్వసిస్తోందని.. ఈసారి బెంగాల్ ప్రజలు మార్పు కోరుతూ బీజేపీకి పట్టం కడతారనే నమ్మకం తనకు ఉందని ధీమా వ్యక్తం చేశారు. బృహన్ ముంబై ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం అనంతరం తొలిసారి పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో మోదీ పాల్గొన్నారు. ఈ ఏడాది ప్రథమార్ధంలో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. రాష్ట్రంలో అవినీతి కారణంగా కేంద్ర పథకాల ప్రయోజనాలు.. పేద ప్రజలకు చేరడం లేదని ప్రధాని ఆరోపించారు. బెంగాల్‌లోని పేదలందరికీ సొంత ఇళ్లు, ఉచిత రేషన్‌తో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందాలన్నదే తన కోరిక అని అన్నారు. పేద ప్రజల కోసం పంపిన సొమ్ములను టీఎంసీ నేతలు లూటీ చేస్తున్నారన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు

# బిజెపి సన్నద్ధం

- సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటాం
- మున్సిపల్ పోరులోనూ బిజెపి హవా చాటుతాం
- రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా



2లో..

**హైదరాబాద్,జనవరి17 :** రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుందని.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పేర్కొన్నారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు చేసిన కృషిని ఆయన అభినందించారు. దాదాపు 5 వేల సర్పంచ్ స్థానాలకు పోటీ చేశామని.. గతంలో కంటే బీజేపీ సర్పంచ్‌ల సంఖ్య పెరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ బలోపేతమైందని.. ఇందుకు ఈ ఫలితాలే నిదర్శనమని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ త్వరలో ముక్కలవు తుందని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని తెలంగాణ బీజేపీ చీఫ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లడం, సభలు నిర్వహించడం తప్ప ఏమీ చేయలేదని విమర్శించారు.

## పునర్విభజన పేరుతో జిల్లాల రద్దు ప్రభుత్వ ప్రయత్నాలను తిప్పి కొట్టాలి



» పార్టీ శ్రేణులకు కెటిఆర్ పిలుపు

**హైదరాబాద్,జనవరి17 :** ప్రజలకు పరిపాలన ఫలాలు అందకుండా జిల్లాల పునర్విభజన పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం జిల్లాల రద్దుపై చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ముఖ్య నేతలతో ఆయన మాట్లాడారు. పాలమూరు, నల్గొండ జిల్లాలకు సంబంధించిన పాలమూరు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనుల్లో జరుగుతున్న ఆలస్యం, కృష్ణా జలాల వాటా వంటి కీలక అంశాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. పాలమూరు జిల్లాలో ఉన్న ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అక్కడి ప్రజలకు ప్రభుత్వం యొక్క సేవలు, అభివృద్ధి అందాల్సిన అవసరాలను వివరించాలన్నారు. కేసీఆర్ పరిపాలన, వికేంద్రీకరణ అనే దృక్పథంతో పాలమూరును అనేక జిల్లాలుగా మార్చిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు.

మిగతాద్ది 2 లో

# తుగ్లక్ పాలన ఏంటో చూస్తున్నాం

- సికింద్రాబాద్ అస్తిత్వం దెబ్బతీసేలా చర్యలు
- సికింద్రాబాద్‌పై పోరాటం ఆపేది లేదు
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్



**హైదరాబాద్,జనవరి17 :** హైదరాబాద్, సికింద్రాబాద్ కు ఎంతో చరిత్ర ఉందని.. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని తొలగించే విధంగా చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తుగ్లక్ గురించి పుస్తకాల్లో చదువుకున్నాం.. ప్రత్యక్షంగా తుగ్లక్ అంటే ఎలా ఉంటాడో కనిపిస్తుందని విమర్శించారు. మొట్టమొదటి పని టీఎస్‌ను టీజీగా చేశారు.. దీనివల్ల ఏ పేదవాడికి న్యాయం జరిగిందో తెలియదు.. తెలంగాణ తల్లిని తీసేసి కాంగ్రెస్ తల్లిని తీసుకొచ్చి పెట్టారన్నారు. ప్రజల దగ్గరికి పాలన పోవాలని అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందాలని వీకేంద్రీకరణను ఒక విశాల దృక్పథంతోనే కేసీఆర్ ప్రారంభించారని.. కొత్త గ్రామాలు మండలాలు రెవెన్యూ డివిజన్లు జిల్లాలను ఏర్పాటు చేశారన్నారు. 10 జిల్లాలను 33 జిల్లాలుగా మార్చారని.. హైదరాబాదులోనూ వార్డులను జోన్లను పెంచడం జరిగిందన్నారు.

మిగతాద్ది 2 లో

## సంక్రాంతి రద్దీ నివారణకు వాహనాల దారి మళ్లింపు




**హైదరాబాద్:** సంక్రాంతి రద్దీ నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. పండగ అనంతరం ఏపీ నుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలను దారి మళ్లిస్తున్నారు. ఎన్‌హెచ్-65 విస్తరణ పనుల దృష్ట్యా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. చిట్యాల, పెద్దకాపర్తి, కొర్లపహాడ్, పంతంగి టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశాలు ఉండటంతో.. పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాలు సూచించారు.

## 'జీవితంలో సంగారెడ్డిలో ఎమ్మెల్యేగా పోటీ చేయను'

**సంగారెడ్డి:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. తాను జీవితంలో సంగారెడ్డిలో ఎమ్మెల్యేగా పోటీ చేయనన్నారు. సంగారెడ్డి మేధావులు తనను ఓడించారని అందుకే ఇక జీవితంలో ఇక్కడ నుంచి పోటీ చేయనని తేల్చిచెప్పారు.




మిగతాది 2లో

## లక్కీ డ్రా లపేరుతో మోసలు

- » అలాంటి వారిని బొక్కలో తోస్తాం
- » ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే
- » నగరపోలీస్ కమిషనర్ సజ్జన్నార్ హెచ్చరిక

**హైదరాబాద్,జనవరి17 :** సోషల్ మీడియాలో లక్కీ డ్రాల పేరుతో జరుగుతున్న మోసాలపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. కార్లు, బైకులు, ప్లాట్లు, డీజేలు ఇస్తామంటూ ఆకర్షణీయ ప్రకటనలతో అమాయకులను మోసం చేస్తున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



# తృణమూల్‌ను సాగనంపే సమయం వచ్చింది

మొదటి పేజీ తరువాయి

'టీఎంసీ ప్రభుత్వం నాకు, బెంగాల్ ప్రజలకు శత్రువుగా మారుతోంది' అని తీవ్రంగా ఆక్షేపించారు మోదీ. బెంగాల్ విజన్‌తోనే 2047 నాటికి అభివృద్ధి భారత్ విజన్ సాకారమవుతుందని ప్రధాని అన్నారు. ఒడిశా, త్రిపుర, అస్సాం, బిహార్‌లో బీజేపీ వరుస విజయాలను ప్రస్తావిస్తూ, ఇప్పుడు బెంగాల్‌లో సుపరిపాలనకు సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. మహారాష్ట్రలో బీజేపీ ఇటీవల చారిత్రక విజయం సాధించిందని, ముఖ్యంగా ముంబై పురపోరు ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిందని గుర్తుచేశారు. 'ఈసారి బెంగాల్లో మార్పు అవసరముందని నేను చెబుతాను.. బీజేపీ సర్కార్ కావాలి' అని మీరు చెప్పండి.. అంటూ సభికులను మోదీ ఉత్సాహపరిచారు. కేంద్ర పథకాలను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని అడ్డుకోవడంపై విమర్శలు గుప్పిస్తూ.. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అడ్డుకున్న ఏకైక రాష్ట్రం బెంగాల్ అని, పేద ప్రజలకు ఎలాంటి పథకాలు అందనీయడం లేదని మోదీ చెప్పారు. ఇలాంటి క్రూర ప్రభుత్వానికి గుడ్‌బై చెప్పే సమయం వచ్చిందన్నారు. మాల్దాలో ఫ్యాక్టరీలు లేకపోవడంతో మాల్దా, ముర్షీదాబాద్ ప్రజలు ఉద్యోగాల కోసం వలసలు వెళు తున్నారని, మామిడి రైతులు ప్రభుత్వ విధానాలు, వరదల సమయంలో చూపిస్తున్న నిర్లక్ష్యంతో ఎంతో నష్టపోతున్నారని అన్నారు. గంగా, ఫులాహార్ నదీ తీర కోత కారణంగా వేలాది మంది ఇళ్లు కోల్పోయారని, రక్షణ గోడ కోరుతూ ప్రజలు చేస్తున్న ఆర్తనాదాలను టీఎంసీ సర్కార్ ఖాతారు చేయడం లేదని విమర్శించారు. కేంద్రం పంపిన వరద సహాయక నిధులు లబ్దిదారులకు చేరలేదని కాగ్ నివేదకలు కూడా చెబుతున్నాయని అన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే టీఎంసీ అనుచిత విధానాలకు స్వస్తి చెప్పి, వరదల నివారణకు సమగ్ర పరిష్కారం కల్పిస్తామని, మామిడి సాగు చేసే మాల్దా రైతుల కోసం కోల్డ్ స్టోరేజీ సౌకర్యం కల్పించి ఆర్థికంగా బలపడేలా చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆకాంక్షలను తీర్చడంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం విఫలమైందని, బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ప్రధాని మోదీ అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే భాజపా ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. బిహార్‌లో ఎన్డీయే విజయం సాధించిందని, ఇక బెంగాల్‌కు సమయం ఆసన్నమైందన్నారు. ఈ సందర్భంగా బెంగాల్‌కు అసలైన సవాల్ చొరబాట్లేనని, వీటిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బెంగాల్‌కు అతిపెద్ద సవాల్ చొరబాట్లేనని.. వీటి కారణంగానే మాల్దా, ముర్షీదాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగుతున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. చొరబాట్ల ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల జనాభా వర్గీకరణలోనూ మార్పు వచ్చిందని, వీటిని అరికట్టడానికి తృణమూల్ కాంగ్రెస్ ఎటువంటి చర్యలు చేపట్టలేదని దుయ్యబట్టారు. రాష్ట్రానికి వరద సహాయ నిధులను 40 సార్లు అందించామని, అయినా అవి అసలైన లబ్దిదారులకు చేరలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కేంద్రం నిధులను తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం కొల్లగొడుతోందని.. ఆ పార్టీ అవినీతి, హింస, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడే పార్టీ అని అన్నారు. టీఎంసీ అధికారం కోల్పోయి.. భాజపా అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. తూర్పు భారత్ దశాబ్దాలుగా వెనకబడి ఉందన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు బిజెపి సన్నద్ధం

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం 40 శాతం కమిషన్‌గా మారిపోయిందని, పారిశ్రామికవేత్తలను బెదిరిస్తుందని ఆరోపణలు చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు పెద్దఎత్తున నిధులు అందిస్తోందని.. వాటితోనే అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రాజెక్టులకు, విద్యాలయాలకు భూమి కేటాయించడం లేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ఏమీ చేయలేదని రాంచందర్ రావు విమర్శించారు. గ్రామాల్లో అభివృద్ధికి ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లాల్సిన అవసరం లేదని, కేంద్ర నిధులతోనే చేయవచ్చని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర పథకాలపై అబద్దాలు ప్రచారం చేస్తోందని.. తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని ఆరోపించారు. మున్సిపాలిటీల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో కేంద్ర పథకాలను తీసుకెళ్లాలని సూచించారు. ఇటీవల త్రివేంద్రం ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేశామని.. కేరళలో కార్యకర్తలపై దాడులు జరిగినా పట్టువదలకుండా పనిచేశామని, ముంబై కార్పొరేషన్‌లోనూ గెలిచామని గుర్తుచేశారు. బీఎంసీ ఎన్నికల్లో 29 మున్సిపాలిటీల్లో 25 స్థానాల్లో బీజేపీ గెలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలన్నారు రాంచందర్ రావు. ప్రజల సేవకు కమిట్మెంట్‌తో పనిచేస్తామని, ప్రజలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. మున్సిపాలిటీలకు కేటాయించిన ప్రాంతాల్లో నాయకులు అక్కడే ఉండాలని, బీజేపీ జెండాను ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పిలుపునిచ్చారు.

# తెలంగాణలో భారీగా ఐపీఎస్‌లు బదిలీ

**విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఐజీగా అభిషేక్ మహంతి**

తెలంగాణలో భారీగా ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. మున్సిపల్ షెడ్యూల్ విడుదలకు ముందే అధికారుల బదిలీ జరగడం విశేషం. ఈ క్రమంలో 20మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఐజీగా అభిషేక్ మహంతి నియమితులయ్యారు. లాజిస్టిక్స్ ఎడీగా గజారావు భూపాల్, ఇంటెలిజెన్స్ డిఐజిగా ఆర్.భాస్కరన్, ఫ్యూచర్ సిటీ అడిషనల్ సీపీగా చందన దీప్తి, సైబరాబాద్ డిసిపిగా టి.అన్నపూర్ణ, ట్రాఫిక్-3 డిసిపిగా రాహుల్ హెగ్డే బదిలీ అయ్యారు. అలాగే అఎఆ ఎస్పీగా ఆర్.వెంకటేశ్వర్లు, హైదరాబాద్ క్రైమ్ డిసిపిగా ఎస్.చైతన్యకుమార్, ట్రాఫిక్-1 డిసిపిగా అవినాష్ కుమార్, ట్రాఫిక్-2 డిసిపిగా కాజల్, సైబరాబాద్ కమిషనరేట్ డిసిపిగా శేషాద్రిని రెడ్డి, మల్కాజ్‌గిరి కమిషనరేట్ డిసిపిగా రాహుల్ రెడ్డి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డిసిపిగా శివం ఉపాధ్యాయ, మల్కాజ్‌గిరి ట్రాఫిక్-2 డిసిపిగా వి.శ్రీనివాసులు బదిలీ అయ్యారు.

# 'జీవితంలో సంగారెడ్డిలో ఎమ్మెల్యేగా పోటీ చేయను'

మొదటి పేజీ తరువాయి

'రాహుల్ గాంధీ వచ్చి నన్ను గెలిపించాలని ప్రచారం చేస్తే, నన్ను ఇక్కడ ఓడించారు. రాహుల్ గాంధీని ఇన్సల్ట్ చేసినట్లు అయ్యింది. జగ్గారెడ్డిని గెలిపించాలని రాహుల్ గాంధీ అడిగితే.. నన్ను ఓడించారు. నా జీవితంలో ఇది మరిచిపోలేనిది. అందుకే సంగారెడ్డిలో జీవితంలో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నా.

నా ఓటమికి కారణం పేద ప్రజలు కాదు..ఇక్కడి మేధావులు.. పెద్దలది. రేపు సంగారెడ్డిలో నా భార్య నిర్మలా పోటీ చేసిన కూడా నేను ప్రచారం చేయను.రాష్ట్రంలో నేను ఎక్కడికైన వెళ్ళి ప్రచారం చేస్తా కానీ.. సంగారెడ్డిలో ప్రచారం చేయను' అని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

# పాలమూరుకు న్యాయం చేస్తాం

మొదటి పేజీ తరువాయి

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, చిట్టబోయినపల్లిలో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి నిర్వహించారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులే ఇప్పటికీ జీవనాధారం అయ్యాయన్నారు. గతంలో భూస్వాములు, దొరల వద్ద లక్షలాది ఎకరాలు ఉండేదదని, భూగరిష్ఠ పరిమితి చట్టం తెచ్చి మిగులు భూములను కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పంచిందని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు పేదలకు పంచేందుకు ప్రభుత్వం వద్ద భూమి లేదని, ఇప్పుడు చేయగలిగింది మంచి విద్య అందించటమేనన్నారు. విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. నిబద్ధత లేని చదువు

వల్ల ప్రయోజనం ఉండదని, ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకోవాలని సూచించారు. 25 ఏళ్లు కష్టపడి చదివితే.. 75 ఏళ్ల వరకు గౌరవంగా జీవించవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహా, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ డీకే అరుణ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కృష్ణానగర్‌లో పేలిన వాషిగ్ మెషిన్ పేలుడు ధాటికి ముక్కలైన మెషిన్

నగరంలో వాషింగ్ మెషిన్ పేలుడు ఘటన కలకలం రేపింది. ఇటీవల.. అమీర్‌పేటలోని ఓ ఇంట్లో వాషింగ్ మెషిన్ పేలిన ఘటన మరువక ముందే కృష్ణానగర్‌లో అలాంటి ఘటనే చోటు చేసుకుంది. మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో రన్నింగ్‌లో ఉన్న వాషింగ్ మెషిన్ ఒక్కసారిగా పేలింది. బట్టలు ఉతకేందుకు.. మెషిన్ ఆన్ చేసి ఉంచగా.. అకస్మాత్తుగా పేలుడు సంభవించింది. రన్నింగ్‌లో ఉండగానే భారీ శబ్దంతో పేలిపోయింది. పేలుడు ధాటికి ఆ వాషింగ్ మిషన్ ముక్కలు ముక్కలైంది. అయితే.. ఘటనా సమయంలో వాషింగ్ మెషిన్ దగ్గర ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పేలుడు ప్రభావంతో ఇంట్లోని వస్తువులు దెబ్బతిన్నాయి. ఒక్కసారిగా వాషింగ్ మెషిన్ పేలడంతో ఇంట్లోని వారు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కాగా.. ఇటీవల కాలంలో ఇలాంటి ఘటనలు హైదరాబాద్‌లో తరుచుగా చోటు చేసుకున్న విషయం తెలిసిందే. గత నవంబర్‌లోనూ అమీర్‌పేట్‌లోని ఒక ఇంటి బాల్కనీలో వాషింగ్ మెషిన్ రన్నింగ్‌లో ఉండగా భారీ శబ్దంతో పేలి తునాతునకలైంది. ఆ ఘటనలోనూ ఎవరూ మెషిన్ దగ్గర లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. అలాగే.. డిసెంబర్ 2025లో ఎస్ఆర్ నగర్ పరిధిలో వాషింగ్ మెషిన్ పేలిన ఘటనలో కంపెనీపై కేసు నమోదైంది. ఇలా తరచుగా వాషింగ్ మెషిన్‌లు పేలుతుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్న పరిస్థితి.

# సంక్రాంతి రద్దీ నివారణకు వాహనాల దారి మళ్లింపు

మొదటి పేజీ తరువాయి

గుంటూరు నుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలను దారి మళ్లిస్తున్నారు. గుంటూరు- మిర్యాలగూడ- హాలియా- చింతపల్లి- మాల్ మీదుగా హైదరాబాద్‌కు వాహనాల మళ్లింపు చేపట్టారు. మాచర్ల- సాగర్- పెద్దవూర- చింతపల్లి- మాల్ మీదుగా వాహనాలను దారి మళ్లిస్తున్నారు.

విజయవాడ నుంచి వచ్చే భారీ వాహనాలు కోదాడ- మాల్ మీదుగా హైదరాబాద్‌కు మళ్లిస్తున్నారు. ఎన్‌హెచ్-65పై ట్రాఫిక్ జామ్ ఏర్పడితే చిట్యాల నుంచి భువనగిరి మీదుగా వాహనాలను దారిమళ్లించనున్నారు. డ్రోన్ కెమెరాలు, సీసీ టీవీలతో ట్రాఫిక్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# పునర్విభజన పేరుతో జిల్లాల రద్దు ప్రభుత్వ ప్రయత్నాలను తిప్పి కొట్టాలి

మొదటి పేజీ తరువాయి

పాలమూరు జిల్లా బిడ్డను అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి ఆ ఉమ్మడి జిల్లాపై కుట్రతో జిల్లాలను రద్దు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ రెండు అంశాలపై ఎక్కడికక్కడ ప్రజలను సమీకరించే విధంగా చైతన్యపరిచేలా వివిధ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రోవైపు రానున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ప్రతి మున్సిపాలిటీ వారీగా ప్రత్యేక కార్యాచరణతో, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సమష్టిగా ముందుకు పోవాలని సూచించారు. జిల్లాలో ఉన్న ఏకైక కార్పొరేషన్ అయిన మహబూబ్‌నగర్ పట్టణంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని వెల్లడించారు. దీంతోపాటు 20 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న హామీల అమలు వైఫల్యాన్ని, మోసాన్ని ఎండగట్టాలని సూచించారు. ఒకప్పుడు తీవ్రంగా వెనుకబడిన నల్లగొండ జిల్లాను బీఆర్ఎస్ హయాంలో ఏ విధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామో ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రస్తుతం ఇద్దరు మంత్రులు ఉన్న నల్లగొండ జిల్లాకు ప్రత్యేకంగా చేసిందేమీ లేదని విమర్శించారు. నల్లగొండ పట్టణాన్ని అభివృద్ధి చేసిన తీరును పట్టణ ప్రజలకు వివరించాలన్నారు. గతంలో టీయూఎఫ్ఐడీసీ , పురపాలక శాఖ ద్వారా గతంలో అనేక వందల కోట్ల రూపాయలతో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావించాలన్నారు. ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలో మొన్నటి పంచాయతీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించారని, అదే స్ఫూర్తిని మున్సిపల్ ఎన్నికల్లో కొనసాగించాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీశ్ రెడ్డి , పలువురు పాల్గొన్నారు.

# తుగ్లక్ పాలన ఏంటో చూస్తున్నాం

మొదటి పేజీ తరువాయి

వాటికి అభివృద్ధి నిధులను కూడా అధికంగా ఇవ్వడం జరిగిందని తెలిపారు. హైదరాబాద్ సికింద్రాబాద్ అనేది తెలంగాణ ప్రజల గొప్ప అస్తిత్వం చిహ్నాలు.. కానీ రేవంత్ రెడ్డి తీసుకున్న తుగ్లకు నిర్ణయం వలన సికింద్రాబాద్‌కి చారిత్రక గుర్తింపు పూర్తిగా పోయేటట్లు ఉన్నదని అభిప్రాయపడ్డారు. సికింద్రాబాద్లోని అన్ని వర్గాల ప్రజలు ఒక్కటై.. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. ప్రజలంతా సంఘటితమై.. మా పార్టీని ఆహ్వానించడం జరిగిందని.. అక్కడ ఉన్న ప్రజాప్రతినిధులు మొత్తం మా పార్టీకి చెందిన వార అన్నారు. సికింద్రాబాద్లో పుట్టిన బిడ్డలుగా సికింద్రాబాద్ అస్తిత్వాన్ని కాపాడాలని పోరాటం చేస్తున్నారు.. అధికారం ఇచ్చింది పట్టణాల అస్తిత్వాలను ప్రజల అస్తిత్వాలను గుర్తు లేకుండా చేరుపడం కోసం కాదని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు.. 'అధికారం ఇచ్చింది గ్యారెంటీలను అమలు చేయడానికి అధికారం ఇచ్చింది ప్రజలు వారికి మంచి చేయాలని.. కానీ ఇలాంటి ఒక్క పని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి చేయడం లేదు.. హైదరాబాద్ నగరంలో రెండు సంవత్సరాలుగా ఒక్క ఇటుక కూడా పెట్టలేదు.. ఒక్క రోడ్డు కూడా వేయలేదు ఒక ఇల్లు కూడా కట్టలేదు.. కానీ నగరం మొత్తం తన విధ్వంసం ప్రణాళికలతోని ముందుకు పోతున్నారు.. ఈరోజు శాంతి ర్యాలీ పేరుతో సికింద్రాబాద్ ప్రజలు ప్రజాప్రతినిధులు ఒక కార్యక్రమాన్ని శాంతియుతంగా చేపట్టారు.. ప్రజల కోరిక మేరకు ప్రజాప్రతినిధులని కోరిక మేరకు తెలంగాణ భవన్ నుంచి బయలుదేరి వెళ్తామని సిద్ధంగా ఉన్నాం.. కానీ నిన్న రాత్రి వరకు అనుమతి ఉందని చెప్పి, ఇప్పుడు అనుమతి లేదని

చెప్పి వేలాది మందిని కార్పొరేటర్లను, మాజీ కార్పొరేటర్ లను పార్టీ సీనియర్ నాయకులను సాధారణ ప్రజలను ఎక్కడికి అక్కడ అరెస్టు చేశారు.. ఇంత అరాచకంగా అక్రమంగా పనిచేస్తున్న ప్రభుత్వం అధికారం శాస్వతంగా కాదని గుర్తుపెట్టుకోవాలి.. ఇప్పుడున్న పదవిలో ఎల్లకాలం కొనసాగరని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాసయాదవ్, కాలె యాదయ్య, కెపి వివేకానంద, ఎమ్మెల్సీలు దేశపతి, వాణి తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ కోటా సేవల విడుదలకు రంగం సిద్ధం

**- 19న విడుదల చేయనున్న టిటిడి**

భక్తుల సౌకర్యార్థం 2026 ఏప్రిల్ నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవలు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన టికెట్లను ఈ నెల 19న ఉదయం 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఎలక్ట్రానిక్ లక్కీడిప్ రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 21న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ-టికెట్లు పొందిన వారు జనవరి 21 నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే.. టికెట్లు మంజూరవుతాయి.

22న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా, సాలకట్ల తెప్పోత్సవాలు, సాలకట్ల వసంతోత్సవాల టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను విడుదల చేయనున్నారు. ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. 24న ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల

చేస్తారు. అదే రోజు.. మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అ÷-దదె గదుల బుకింగ్ కోటాను విడుదల చేస్తారు. మార్చి నెలకు సంబంధించిన శ్రీవారి సేవ, పరకామణి సేవ కోటాను ఈనెల 27న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. భక్తులు వెబ్‌సైట్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని తితిదే అధికారులు సూచించారు.

# ఇరాన్ అల్లర్ల కుట్రదారు ట్రంప్ తీవ్ర విమర్శలు చేసిన ఇరాన్ సుప్రీం ఖమేని

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నిరసనలకు మద్దతిచ్చిన ట్రంప్‌ను నేరస్థుడిగా పరిగణిస్తున్నామన్న ఆయన.. ఇరాన్‌లో ఆందోళనలకు, ప్రాణ నష్టానికి ఆయనే కారణమని ఆరోపించారు. ఇటీవల చోటు చేసుకున్న ఆందోళనల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఖమేనీ తొలిసారి ప్రస్తావించారు.

ఇటీవల ఆందోళనల వెనుక అమెరికా కుట్ర దాగుంది. ఇరాన్‌ను అణచివేయడం, ఆధిపత్యం చలాయించడం వారి లక్ష్యం. ఆందోళనల వేళ అమెరికా అధ్యక్షుడు స్వయంగా వ్యాఖ్యలు చేస్తూ నిరసనకారులకు మద్దతు ప్రకటించారు. అందుకే ఆయన్ను నేరస్థుడిగా పరిగణిస్తున్నాం. నిరసనల్లో పాల్గొన్నవారు అమెరికా కోసం పనిచేసిన వారే. విద్యా సంస్థలు, ప్రార్థనా మందిరాలను ధ్వంసం చేశారు. ఎంతో మందిని గాయపరిచారు' అని సుప్రీం లీడర్ ఖమేనీ పేర్కొన్నారు. ఆందోళనకారులు విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న మందుగుండు సామగ్రిని వినియోగించారని ఖమేనీ ఆరోపించారు. యుద్ధం వైపు దేశాన్ని తీసుకెళ్లాలని అనుకోవడం లేదన్నారు. నేరుస్థుల్లో విదేశీయులూ ఉన్నారన్నారు. నేరస్థులెవరినీ విడిచిపెట్టబోమని, కేసులను కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఆందోళనల్లో పాల్గొన్న వారిలో దాదాపు 800 మందికి ఇరాన్ మరణశిక్ష అమలు చేస్తుందనే వార్తలు వచ్చాయి. అమెరికా హెచ్చరికల నేపథ్యంలో గల్ఫ్ దేశాలు జోక్యం చేసుకోవడం తదితర పరిణామాల తర్వాత ఇరు దేశాలు వెనక్కి తగ్గినట్లు కనిపించింది. ఈ నేపథ్యంలో ఖమేనీ స్పందిస్తూ అమెరికాపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరోవైపు ఇరాన్ హింసాత్మక ఘటనల్లో ఇప్పటి వరకు 3వేలకు పైగా మరణించినట్లు అంతర్జాతీయ నివేదికలు వెల్లడించాయి.

# లక్కీడ్రా లపేరుతో మోసలు

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ఇటీవల సోషల్ మీడియా వేదికగా లక్కీ డ్రాల పేరుతో భారీగా మోసాలు జరుగుతున్నాయని గుర్తించామని అన్నారు. 'కేవలం రూ.99తో కారు గెలుచుకోండి. లక్కీ డ్రాలో బైక్, ఫ్లాట్, ఖరీదైన బహుమతులు' అంటూ ప్రచారం చేస్తూ ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని డబ్బులు వసూలు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. ఈ స్కామ్‌లలో ముఖ్యంగా యువత, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నష్టపోతున్నారని సజ్జనార్ పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో కొంతమంది ఇన్‌ఫ్లూయెన్సర్లు కొత్త వేషాల్లో లక్కీ డ్రా స్కామ్‌లకు తెరలేపారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌ల మాదిరిగానే వీటి ద్వారా కూడా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి, చివరికి ఎలాంటి బహుమతులు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ విషయంలో సీపీ సజ్జనార్ కఠినంగా స్పందించారు. సెలబ్రిటీలు, సోషల్ మీడియా స్టార్లయినా సరే ఎవరికీ మినహాయింపు లేదని స్పష్టం చేశారు. పాపులారిటీని అడ్డం పెట్టుకుని ప్రజలను దోచుకుంటే కఠిన చర్యలు తప్పవని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. లక్కీ డ్రాల పేరుతో మోసాలకు పాల్పడే వారిపై ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్(బ్యానింగ్) యాక్ట్1978 కింద కేసులు నమోదు చేస్తామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. అవసరమైతే ఐటీ యాక్ట్, చీటింగ్ కేసులు, క్రిమినల్ చట్టం కింద సెక్షన్లు విధించే అవకాశం ఉందని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ప్రజలు లక్కీ డ్రాల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే ఆకర్షణీయ ప్రకటనలను నమ్మకండని.. ముందుగా డబ్బులు అడిగే లక్కీ డ్రాలు మోసమేనని, కార్లు, బైకులు, ఎ÷-లాట్లు ఇస్తామంటూ చేసే ఆఫర్లను నిర్ధారించుకోకుండా నమ్మొద్దని సూచించారు. అనుమానాస్పద ఖాతాలు, పోస్టులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. లక్కీ డ్రా స్కామ్‌లకు గురైన వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో, సైబర్ క్రైమ్ విభాగంలో అధికారిక హెల్ప్‌లైన్స్ ద్వారా ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ల దందా బంద్ కావడంతో లక్కీ డ్రా అంటూ కొత్త వేషాలతో వీళ్లు దర్శనమిస్తున్నారని తెలిపారు. ఈ తరహా మోసాలకు పాల్పడే సెలబ్రిటీలైనా, సోషల్‌మీడియా స్టార్లయినా సరే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పాపులారిటీని అడ్డం పెట్టుకుని ప్రజలను దోచుకుంటే కఠిన చర్యలు తప్పవని సజ్జనార్ హెచ్చరించారు.

# మేడారం జాతరకు దగ్గరపడుతున్న ఘడియలు

ఆసియా ఖండంలోనే అతిపెద్ద మహోత్సవం మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు శరవేగంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇంటిల్లిపాది తరలివెళ్లి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. రెండేళ్లకోసారి జరిగే ఈ జాతర సమీపిస్తున్న వేళ ఇప్పటికే చాలా మంది భక్తులు మేడారం బాట పడుతున్నారు. ఈనెల 28, 29, 30, 31 తేదీల్లో మహాజాతర జరగనుండగా భక్తులను తరలించేందుకు ఆర్టీసీ అధికారులు సమాయత్తం అవుతున్నారు. జాతర జరిగే మూడు రోజుల ముందు నుంచే ప్రత్యేకంగా బస్సు సర్వీసులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. భూపాలపల్లి ఆర్టీసీ డిపో నుంచి వివిధ ప్రాంతాల మీదుగా మేడారానికి భక్తులతను సురక్షితంగా తరలించేందుకు భూపాలపల్లి ఆర్టీసీ డిపో అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ నెల 25 నుంచి మొదలై జాతర మొదలు ఫిబ్రవరి 1 వరకు ప్రత్యేక బస్సులను నడిపించనున్నారు. 8 రోజుల పాటు భక్తులను తరలించేందుకు ప్రత్యేకంగా 340 బస్సులను సిద్ధం చేశారు. రోజుకు సుమారు 50 ట్రిప్పులను నడిపించనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇందుకు నాలుగు టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. సకాలంలో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయడంలో గతంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపించాయి. ఫలితంగా ప్రైవేటు వాహనాల్లోనే భక్తులు తరలివెళ్లడంతో అతి తక్కువ మంది ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఎదురైందనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వం మహిళల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఈ జాతరలో ఆర్టీసీలో ఉచిత ప్రయాణాలను కల్పించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న తరహాలోనే సూపర్ లగ్జరీ బస్సులు మినహా ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీల్లో మేడారానికి తరలివెళ్లే భక్తులకు ఉచిత ప్రయాణ సదుపాయం ఉంటుందని అధికారులు వెల్లడించారు. అయితే, చార్జీల పెంపు ఉంటుందనే చర్చ సాగతుండగా వాటిపై ప్రభత్వం ఇప్పటికి స్పష్టతనివ్వలేదు.

# ఎల్లంపేట మున్సిపల్ వార్డుల రిజర్వేషన్లు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

నూతనంగా ఏర్పడ్డ ఎల్లంపేట మున్సిపాలిటీ తొలి ఎన్నికలకు సిద్ధమవుతున్నది.
ఎల్లంపేట కేంద్రంగా రావల్ కోల్, రాజ బొల్లారం,రాజ బొల్లారం తాండ, ఘనపూర్, సైదోని గడ్డ, సైదోని గడ్డ తాండ, సోమారం, డబిల్ పూర్,లింగాపూర్,శ్రీరంగవరం గ్రామాలు కలిపి ఒక మున్సిపాలిటీ గా ఏర్పాటు జరిగింది.
మొత్తం 11 గ్రామాలు కలిపి 24 వార్డులుగా మున్సిపల్ పాలనా పరిధి ఏర్పాటు జరిగింది.

పై గ్రామాలలోని నూతన్ కల్ లాంటి పెద్ద గ్రామాలను 4 వార్డులుగా విభజించడం పట్ల నిరసన కూడా వినిపించింది.
పెద్ద గ్రామాల ఉనికి దెబ్బతీస్తూ ముక్కలు చేసి గ్రామ సమగ్రత దెబ్బ తీయడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు అసంతృప్తి నిరసన వ్యక్తం చేసారు.
అయినా ప్రజల డిమాండ్ ను లెక్కచేయకుండా వార్డుల విభజన అసహజంగా జరిగిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

- **ఆశావహుల ఆటలు షురూ**

ఈ వార్డుల విభజన జరిగిన వార్త బయటకు పొక్కగానే ఎక్కడికక్కడ ఆశావహులు పోటీకి తయారవుతున్నారు.
ఆశించిన రిజర్వేషన్లు రాలేదని కొందరు నిరాశకు గురవుతున్నారు.

YELLAMPET MUNICIPALITY RESERVATION

| Ward No. | RESERVATION | MEN / WOMEN |
|---|---|---|
| 4 | ST | GENERAL |
| 8 | ST | WOMEN |
| 9 | ST | GENERAL |
| 5 | ST | WOMEN |
| 2 | ST | GENERAL |
| 21 | SC | GENERAL |
| 7 | SC | GENERAL |
| 12 | SC | WOMEN |
| 20 | SC | WOMEN |
| 24 | BC | WOMEN |
| 17 | BC | GENERAL |
| 18 | BC | GENERAL |
| 1 | GEN | WOMEN |
| 3 | GEN | WOMEN |
| 6 | GEN | WOMEN |
| 10 | GEN | WOMEN |
| 11 | GEN | WOMEN |
| 13 | GEN | GENERAL |
| 14 | GEN | GENERAL |
| 15 | GEN | GENERAL |
| 16 | GEN | GENERAL |
| 19 | GEN | WOMEN |
| 22 | GEN | WOMEN |
| 23 | GEN | GENERAL |

నూతనంగా ఏర్పాటైన ఎల్లంపేట మున్సిపాలిటీలో పాలనా పగ్గాలు చేపట్టాలని పోటీలు మొదలయ్యాయి.
ఇక పార్టీల వారిగా బలాబలాలు తేల్చుకోవడానికి నాయకుల ఎత్తుగడలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.
ఈ మున్సిపాలిటీలో బలంగా ఉన్న బిఆర్ఎస్ ను ఎదురొడ్డి పాగా వేయాలని కాంగ్రెస్ నాయకులు పావులు కదుపుతున్నారు.
ప్రధాన పార్టీల్లో ఒకటైన బిజెపి తన అభ్యర్థుల ఎంపికలో మునిగిపోయింది. సిట్టింగ్ ఎంపీ ఈటెల రాజేందర్ అండతో గెలవడానికి బిజెపి అభ్యర్థులు ఆశావహంగా ఉన్నారు.




నిన్న బయటకు వచ్చిన రిజర్వేషన్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

- 1వ వార్డు రావల్ కోల్ (జనరల్ మహిళ)
- 2వ వార్డు రావల్ కోల్ (ఎస్టీ జనరల్)
- 3వ వార్డు రావల్ కోల్,రాజబొల్లారం ౨ తాండ,రాజబొల్లారం (జనరల్ మహిళ)
- 4వ వార్డు రాజబొల్లారం తాండ (ఎస్టీ జనరల్)
- 5వ వార్డు ఘనపూర్ (ఎస్టీ మహిళ)
- 6వ వార్డు రాజబొల్లారం,ఘనపూర్ (జనరల్ మహిళ)
- 7వ వార్డు రావల్ కోల్ (జనరల్ మహిళ)
- 8వ వార్డు సైదోనిగడ్డతాండ,రావల్ కోల్ (ఎస్టీ మహిళ)
- 9వ వార్డు సోమారాం,సైదోనిగడ్డతాండ (ఎస్టీ జనరల్)
- 10వ వార్డు ఎల్లంపేట (జనరల్ మహిళ)
- 11వ వార్డు డబిల్ పూర్,ఎల్లంపేట (జనరల్ మహిళ)
- 12వ వార్డు డబిల్ పూర్ (జనరల్)
- 13వ వార్డు డబిల్ పూర్ (జనరల్)
- 14వ వార్డు డబిల్ పూర్ (జనరల్)
- 15వ వార్డు నూతన్ కల్,లింగాపూర్ (జనరల్)
- 16వ వార్డు నూతన్ కల్ (జనరల్)
- 17వ వార్డు శ్రీరంగవరం (బీసీ జనరల్)
- 18వ వార్డు శ్రీరంగవరం (బీసీ జనరల్)
- 19వ వార్డు బండమాదారం,శ్రీరంగవరం (జనరల్ మహిళ)
- 20వ వార్డు శ్రీరంగవరం (ఎస్సీ మహిళా)
- 21వ వార్డు నూతన్ కల్,శ్రీరంగవరం (ఎస్సీ జనరల్)
- 22వ వార్డు మైసిరెడ్డి పల్లి,కోనాయిపల్లి,నూతన్ కల్ (జనరల్ మహిళ)
- 23వ డబిల్ పూర్ (జనరల్)
- 24వ వార్డు ఎల్లంపేట (బీసీ మహిళ)

ఈ ఎన్నికల సమరం ప్రారంభమవుతుందని ఇంకోపక్క ఓటర్లు డబ్బుల కొరకు,మందు కొరకు ఎదురు చూడడం మొదలయ్యింది.
ఈ కొత్త మున్సిపాలిటీలో కొత్త పాలకుల కొలువు తీరు మొదలవుతుందని ప్రజల్లో ఆతురత మొదలయ్యింది.

# తెలంగాణ వార్డు మెంబర్ల ఫోరం

## – రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా సుజాత నియామకం



**కొండబత్తిని అమర్ నాథ్, కోరుట్ల ప్రతినిధి**
తెలంగాణ వార్డు మెంబర్ల ఫోరం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా సుజాత నియామకం జగిత్యాల జిల్లా, కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామానికి చెందిన గాంధారి సుజాతను తెలంగాణ వార్డు మెంబర్ల ఫోరం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా శనివారం నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు మెంబర్ల హక్కుల సాధన, ప్రజా సమస్యల పరిష్కారం, మహిళా రాజకీయ సాధికారికత కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం నాయకులు నవీన్, పరంధాములు, మేకల అక్షయ్ కుమార్, గాంధారి మనోహర చారి, శ్రీనివాస్, నిరంజన్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తుల జాప్యంపై ప్రజాగ్రహం



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంపై ఎన్‌బీఎంఐ మేడ్చల్––మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు రవి రాజ్ రాథోడ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల దరఖాస్తులను అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ దరఖాస్తులను ప్రభుత్వం సుమోటోగా స్వీకరించి తక్షణమే పరిష్కరించాలని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జాప్యం చేస్తే ప్రజా ఉద్యమాలకు దిగుతామని హెచ్చరించారు.

# 19న జరిగే మహాకార్మిక ప్రదర్శన, సభను విజయవంతం చేయాలి

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జనవరి 17**
జీప్ జాత ద్వారా సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు
దేశవ్యాప్తంగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజావ్యతిరేక చట్టాల రద్దు కోసం చేపడుతున్న ఉద్యమంలో భాగంగా ఈ నెల 19వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మహాకార్మిక ప్రదర్శన, సభను విజయవంతం చేయాలని సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు జీప్ జాత ద్వారా పిలుపునిచ్చాయి.
నాలుగు లేబర్ కోడ్స్, వీబీ రామ్ జి చట్టం, జాతీయ విత్తన బిల్లు, విద్యుత్ సవరణ బిల్లు వంటి కార్పొరేట్ అనుకూల చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ఉద్యమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహిస్తూ జీప్ జాతలు చేపట్టి, 19న జిల్లా కేంద్రానికి పెద్ద సంఖ్యలో కార్మికులు, రైతులు, ప్రజలు తరలిరావాలని కోరారు.
శనివారం ఇల్లంతకుంట మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్ మాట్లాడుతూ, గత 11 ఏళ్లుగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తూ, రాష్ట్రాల అధికారాలను హరిస్తోందని విమర్శించారు. 1991లో దేశ సంపదలో ఒక్క శాతం వాటా ఉన్నవారు నేడు 162 కుటుంబాలుగా మారి దేశ సంపదలో 25 శాతం తమ ఆధీనంలో ఉంచుకున్నారని తెలిపారు. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రాయితీలు ఇస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను ఆదానీ, అంబానీ వంటి బడా పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు.
నాలుగు లేబర్ కోడ్స్ అమలుతో కార్మికుల జీవన ఆదాయం తీవ్రంగా పడిపోతుందని, 29 కార్మిక చట్టాల స్థానంలో తీసుకొచ్చిన ఈ నాలుగు కోడ్స్ పూర్తిగా కార్పొరేట్ లాభాల కోసమే రూపొందించబడ్డాయని పేర్కొన్నారు. పార్లమెంటులో వీటిని ఉపసంహరించుకునే వరకు సమైక్య ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



2025 విద్యుత్ సవరణ చట్టం ద్వారా విద్యుత్ టారిఫ్‌లను కేంద్రం నియంత్రిస్తుందని, స్మార్ట్ మీటర్ల పేరుతో ముందస్తు వసూళ్లు చేస్తారని, ఉచిత విద్యుత్తు, క్రాస్ సబ్సిడీ పూర్తిగా రద్దయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్రాల హక్కులను తొలగించి, విద్యుత్ ఉత్పత్తి––సరఫరా వ్యవస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకే ఈ చట్టం తెచ్చారని విమర్శించారు.
జాతీయ విత్తన బిల్లుపై మాట్లాడుతూ, టాటా, బిర్లా, ఐటీసీతో పాటు డూపాంట్, కార్గిల్, సింజెంటా, బేయర్ వంటి విదేశీ సంస్థలు విత్తన రంగాన్ని 80 శాతం వరకు తమ నియంత్రణలోకి తీసుకునేలా ఈ బిల్లు ఉందని తెలిపారు. ఇది రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.
ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము మాట్లాడుతూ, వామపక్షాల పోరాటాల ఫలితంగా 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు. ఈ చట్టం ద్వారా దళితులు, గిరిజనులు, పేదలకు ఉపాధి లభిస్తోందని, అయితే ఇప్పుడు రాష్ట్రాలపై భారం మోపుతూ ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సమైక్య పోరాటంతో ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని, పట్టణ ప్రాంతాలకు కూడా విస్తరించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు మారెళ్ల శ్రీలత, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుండేటి వాసుదేవ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాయికంటి శ్రీనివాస్తో పాటు తిప్పరబోయిన శ్రీకాంత్, మల్లయ్య, రమేష్, కుమార్, సారయ్య, ఐలయ్య, ఎల్లయ్య, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# అత్వెల్లి డంపింగ్ యార్డును ఎత్తివేయాలి
## కాలుష్యంపై బిజెపి నేత ఆందోళన






**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ లోని అత్వెల్లి ప్రాంతంలో డంపింగ్ యార్డు నుండి వెలువడుతున్న కాలుష్యం ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు కలిగిస్తోందని, శ్వాస తీసుకోవడం కూడా కష్టంగా మారిందని బిజెపి నేత జకట ప్రేమ్ దాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం మరో జవహర్ నగర్ డంపింగ్ యార్డులా మారకముందే ప్రజలను కాపాడాలని, వెంటనే డంపింగ్ యార్డును తొలగించే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# గంగపుత్రులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న

- 80 లక్షలతో బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ పట్టణానికి చెందిన గంగపుత్రులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నానని ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ తెలిపారు. శనివారం పట్టణంలోని మూలవాగులో కొలువైన శ్రీ గంగాభవాని దేవాలయానికి 80 లక్షలతో బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గంగమ్మ కళ్యాణం, జాతర సందర్భంగా గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్నికల సమయంలో నా దృష్టికి తీసుకురావడం జరిగిందని, ఎమ్మెల్యేగా గెలిచిన మరుక్షణమే బ్రిడ్జి నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చానని, ఆ హామీని ఇప్పుడు నిలబెట్టుకున్నానని గర్వంగా చెప్పారు. గంగమ్మ దేవాలయం చుట్టూ నిలుస్తున్న మురికి నీరు తరలింపుకు నిధులు మంజూరై పనులు కూడా ప్రారంభమయ్యాయని, మూల వాగులో మురికి నీరు కనపడకుండా చేసే బాధ్యత తనదేనని చెప్పారు. బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేసిన ప్రభుత్వ విప్ కు గంగపుత్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, చంద్రగిరి శ్రీనివాస్, సాగరం వెంకటస్వామి, గంగపుత్ర సంఘం నాయకులు పంపరి శంకర్, కూర దేవయ్య, పంపరి దేవయ్య, కూర దేవేందర్, పంపరి నాగరాజు తదితరులున్నారు.

# అభివృద్ధి ,సంక్షేమంపై బీజేపీ బిఆర్ఎస్ చర్చకు సిద్ధమా. సుడా చైర్మన్

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జనవరి 17**
బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అవినీతికి కేరాఫ్ అడ్రస్ పబ్లిసిటీ తప్ప మీకు పనులు చేతకావా గంగుల,బండి కరీంనగర్ కు చేసింది తక్కువ ప్రచారం ఎక్కువ రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కనపడటం లేదా సవాల్ విసిరి, ఘాటుగా విమర్శించిన సుడా ఛైర్మన్ నరేందర్ రెడ్డి
కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో బిజేపీ, బీఆర్ఎస్ లు చేసిన అభివృద్ధి తక్కువ ప్రచార ఆర్భాటం ప్రజా ధనం దుర్వినియోగం ఎక్కువ అని, ఆ రెండు పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని సుడా ఛైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి విమర్శించారు. కరీంనగర్ లో బిజేపీ, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ ఆయన సవాల్ విసిరారు. ప్రజా కోర్టులో కరీంనగర్ కు ఎవరేం చేశారో చర్చించే దమ్ముందా అని ఆయన ప్రశ్నించారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, మాజీ మంత్రి, స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ లు కరీంనగర్ కు పదేళ్లలో ఏం చేశారో చెప్పాలని సుడా ఛైర్మన్ నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కు సోషల్ మీడియాలో పబ్లిసిటీ, మీడియాలో బ్రేకింగుల కోసం సంచలన వ్యాఖ్యలు తప్ప ఏమీ చేతకావడం లేదని అన్నారు. కరీంనగర్ లో ఎంపీగా రెండు సార్లు గెలిచి కేంద్రమంత్రి గా ఉండి ఏం చేశారో చెప్పాలని అన్నారు. కేంద్రంలో బిజేపీ అధికారంలో ఉందని, అదనంగా కరీంనగర్ కు తెచ్చింది, ఇచ్చింది ఏంటో చెప్పాలని అన్నారు. మోదీ మెచ్చుకున్నంత మాత్రాన కరీంనగర్ కు ఏం తెచ్చారని ప్రశ్నించారు.
కేంద్రం నుంచి ఒక్క ప్రాజెక్టు, యువత కోసం ఉపాధి కల్పించే విషయంలో బండి సంజయ్ విఫలం అయ్యారని అన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ పనులన్నీ నాసిరకంగా, పద్ధతి, ప్లాన్ లేకుండా చేశారని, ఐదు లక్షల జనాభాకు సరిపడా రోడ్లే లేవని, పెద్దరోడ్లను కుదించారని అన్నారు. పదేళ్లలో బిజేపీ, బీఆర్ఎస్ లు ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేయలేదని అన్నారు.కరీంనగర్ సుందరీకరణ పేరుతో



ఉన్నదానికంటే పెంచి జంక్షన్లకు కోట్ల రూపాలు ఖర్చు పెట్టి ప్రజాధనం దుర్వినియోగం చేశారని అన్నారు.
మున్సిపల్ లో 20 కోట్ల సాధారణ నిధులు, సుడా ద్వారా 20 కోట్లతో అంతర్గత రోడ్లు డ్రైనేజీలు నిర్మించామని తెలిపారు. డ్రైనేజీలకు, రోడ్ల పునరుద్ధరణకు కోట్ల రూపాయలు ఖర్చు పెడుతుంటే.. కాంగ్రెస్ ఏమీ చేయలేదని ఎలా అంటారని ఆయన ప్రశ్నించారు. పదేళ్లలో కరీంనగర్ లో ఒక్క వర్షానికే రోడ్లు మునిగాయని, ప్రధాన రహదారులన్నీ బ్లాక్ అయ్యాయని అన్నారు. వర్షం నీళ్లు నిలిచే డేంజర్ స్పాట్ల దగ్గర పది కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఆర్టీసీ వర్క్ షాప్, టూటౌన్ పోలీస్ స్టేషన్, రాంనగర్ బస్ స్టాప్ వద్ద నీళ్లు నిలవకుండా కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అవినీతికి అడ్డుకట్ట వేశామని, ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం లేదని అన్నారు. నగర బ్యూటిఫికేషన్ విషయంలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బ్యూటిఫికేషన్ లో కరీంనగర్ నంబర్ వన్ ఉండేలా చేస్తామన్నారు. కొత్తగా ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఇలా కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తుంటే.. రూపాయి కూడా పెట్టలేదంటారా? మీలాగా పబ్లిసిటీ పిచ్చిలో మేం పడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అభివృద్ధి చేసుకుంటూ పోతున్నాం.. ప్రజలకు జవాబు దారితనంగా ఉంటామన్నారు. బీఆర్ఎస్ కథ ముగిసిందని, మాటలతో నడిపించే బీజేపీ కథ కూడా ముగుస్తుందని అన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ పై కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని తెలిపారు.

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు.
–కార్పోరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్

గత రెండేళ్లుగా ప్రభుత్వం అమలు పరస్తున్న రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇందిరమ్మ ఇండ్లు ఉచిత బస్సు లాంటి సంక్షేమ పథకాలను పొందుతున్న లబ్ధి దారుల వద్దకు వెళ్లి మద్దతు కోరుతామని రాబోయే రోజుల్లో ఇంకా ఎన్నో పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి ఓటు అడుగుతామని అన్నారు.ఈ విలేకరుల సమావేశంలో అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్,ఎండి తాజ్,పిట్టల రవీందర్,కుర్ర పోచయ్య,మాసూమ్ ఖాన్,కిరణ్ రెడ్డి,ముల్కల యోన, బషీర్, భారీ,ఖలీల్, సుదర్శన్,తోట అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# మెట్లకు రేలింగ్ లేక భక్తుల ఇబ్బందులు

## – వృద్ధులకు, మహిళలకు తప్పని కష్టాలు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి బాలాలయంగా రూపుదిద్దుకున్న శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలోని గాయత్రీ మాత ఆలయానికి వెళ్లే భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు.. గాయత్రి మాత ఆలయ మెట్లకు రైలింగ్ లేక వృద్ధులు, మహిళలు, చంటి పిల్లల తల్లులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధులైతే ఇతరుల సహాయంతో మెట్లు ఎక్కి దిగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఆలయ ఈవో, అధికారులు భక్తుల కష్టాలను గుర్తించి మెట్లకు ఇరువైపులా, మధ్య భాగంలో రేలింగ్ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు...

# వెల్దుర్తి మండల కేంద్రంలోని కుడి చెరువు లో గ్రామ ప్రజలు చెత్త పదార్థాలు వేస్తే వెయ్యి రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపిన

**– వెల్దుర్తి గ్రామపంచాయతీ 8వ వార్డు సభ్యులు మహేందర్ గౌడ్**
**–గ్రామపంచాయతీ కార్యదర్శి బలరాం రెడ్డి**

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట జనవరి 17**

మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోనివెల్దుర్తి గ్రామ ప్రజలు కుడి చెరువు కు వెళ్లే కోమటిపల్లి రహదారికి సమీపంలో ఉన్నటువంటి కుడి చెరుకట్ట చెరువులో వెల్దుర్తి గ్రామప్రజలువాడుకున్నటువటి వ్యర్థ పదార్థాలను చెరువులో వేయడం జరుగుతుందని అలా వేయడంతో గ్రామ సమీపంలో ఉన్నటువంటి కుడి చెరువు లో వేసినటువంటి వ్యర్థపదార్థాలకు గ్రామంలో సంచరిస్తున్నటువంటి జంతువులు పందులు కానీ పాడి పశువులు కానీ దప్పిక కోసం వచ్చినటువంటి సందర్భాలలో




ప్రమాదాలకు గురి అవ్వడమే కాకుండా గ్రామ ప్రజలు కుడి చెరువు గ్రామ సమీపంలో ఉండడంతో వారు నిత్యం బట్టలను ఉతకడానికి వెళ్లడం జరుగుతుందని గ్రామ ప్రజలు ఎన్నో వ్యర్థ పదార్థాలను చెరువులో వేయడంతో అనారోగ్యాలకు గురి కావడం జరుగుతుందని కోమటిపల్లి నుండి కుడిచెరువుకు వెళ్లే దారి సమీపంలో కుడి చెరువులో ఎటువంటి వ్యర్థ పదార్థాలు గాని చెత్త చెదారం గాని వేసిన వారిపై కచ్చితంగా వెయ్యి రూపాయల జరిమానా



విధించడం జరుగుతుందని అలా వేసినటువంటి సందర్భంలో ఎటువంటి వీడియోలు కానీ ఫోటోలు కానీ తమకు అందజేస్తే వారి కూడా ఎంతో కొంత పారిశోథకం ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు వెల్దుర్తి గ్రామ అభివృద్ధి తమ అద్వేయంగా గతంలో కూడా వార్డు సభ్యునిగా పనిచేశామని తాము చేసిన అభివృద్ధి పనులను చూసి తెలంగాణ రాష్ట్రంలో జరిగినటువంటి మూడోసారి సర్పంచ్ ఎన్నికల్లో కూడా తాను వార్డు సభ్యుడిగా నిలబడితే మళ్లీ గెలిపించారాని తాను గతంలో చేసిన అభివృద్ధి పనులను నిదర్శంగా తీసుకొని మునుముందు మరింత ఎనిమిదవ వార్డును అభివృద్ధి చేసే ప్రయత్నంలోనే ఉంటానని ముఖ్యంగా తాను గెలిపించిన వార్డు ఓటర్లు తనకు సహకరించి మన వార్డు అభివృద్ధి చెందాలి అంటే తనతో సహకరిస్తే వార్డును మరింత అభివృద్ధి చెందే దిశలోనే ప్రయత్నిస్తానని అందరం కలిసి మెట్టుగా ఉంటే వార్డు ను ఎంతో అభివృద్ధి చేస్తానని వార్డు ఓటర్లకు హామీ ఇస్తున్నానని గ్రామ ప్రజలు ఆలోచించి మీ ఇంటి పరిసర ప్రాంతాలే కానీ మీకు సంబంధించినటువంటి వ్యర్థ పదార్థాలు చెత్తాచెదారాన్ని కుడి చెరువులో వేయకుండా ఉండాలని వెల్దుర్తి గ్రామ ప్రజలను కోరుతున్నానని వారు తెలియజేశారు గ్రామ అభివృద్ధి ధ్యేయంగా తాను వార్డును ఎంతో అభివృద్ధి చేసే ప్రయత్నంలోనే ఉంటానని అందరి సహకారంతో అందరం కలిసి మెలసిగ్రామపంచాయతీ అయినటువంటి వెల్దుర్తి ని అభివృద్ధి చేసుకొని ప్రయత్నం చేయాలని ఆశిస్తూ వెల్దుర్తి గ్రామపంచాయతీ వార్డులలో మన ఎనిమిదవ వాడు ఎంతో అభివృద్ధి చేస్తానని తెలిపారు నా యొక్క విన్నపాన్ని వినిపించుకొని వెల్దుర్తి గ్రామ ప్రజలు కుడి చెరువులో మాత్రం ఎటువంటి వ్యర్థ పదార్థాలను కానీ చెత్త చెదరని వేసిన ఎవరు అయినా సహించ బొమనివారు తెలియజేశారు ఇటువంటి నిబంధనలకుగ్రామపంచాయతీ సిబ్బంది అధికారులు సహకరించాలనిపత్రికాముఖంగా తెలియజేస్తున్నాను వెల్దుర్తి గ్రామప్రజలకువిన్నపించుకున్నటువంటి ఈ ప్రక్కననుఎవరైనా ఉల్లంఘించిన వారిపై కుడి చెరువులో వ్యక్త పదాలు వేస్తే వారికి విధించడం వెల్దుర్తి గ్రామ పంచాయతీ కార్య దర్శి సమక్షంలో జరిమానా విధించడం జరుగుతుందని వెల్దుర్తి గ్రామపంచాయతీ ఎన్నికవ్వ వార్డు సభ్యులు అంగడిపేట మహేందర్ గౌడ్

## మాఘ అమావాస్య జాతర ఏర్పాట్లపై ఈవో సమీక్ష

**– భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు ఉండాలి**
**–రాజన్న ఆలయ ఈవో ఎల్.రమాదేవి**



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దత్తత దేవాలయమైన మామిడిపల్లి శ్రీ సీతారాముల స్వామివారి దేవస్థానంలో ఆదివారం జరగనున్న మాఘ అమావాస్య జాతర ఏర్పాట్లపై రాజన్న ఆలయ ఈవో ఎల్.రమాదేవి సంబంధిత అధికారులతో ఈవో కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసే అవకాశం ఉన్నందున భక్తుల సౌకర్యార్థం చలువ పందిళు త్రాగునీటి ఏర్పాట్లు, క్యూలైన్స్ నిర్వహణ,పార్కింగ్ సదుపాయాలు,విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు శ్రవణ్ కుమార్, బ్రహ్మన్న గారి శ్రీనివాస్, జయ కుమారి, గోవిందుల అశోక్ కుమార్, సూపరిండెంట్లు శ్రీనివాస్ శర్మ, విజయ్ కుమార్, వెల్ది సంతోష్, భాను, విశ్రాంత ఏఈ ద్వారక శేఖర్, అకౌంటింగ్ విభాగం అడ్వైజర్ ఆగమరావు ఉన్నారు.

## భీమన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్ సతీమణి అనిత




**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య సతీమణి, బీర్ల ఫౌండేషన్ చైర్మన్ అనిత దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనం గావించి, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

## ముస్లింల దశాబ్దాల కళ నెరవేరేబోతుంది

**– ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
**– జిల్లా కలెక్టర్ తో కలిసి షాది ఖానా నిర్మాణానికి భూమి పూజ**

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



వేములవాడ పట్టణ ముస్లిం దశాబ్దాల కల నెరవేరబోతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. శనివారం పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అక్రమ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ తో కలిసి పట్టణంలోని షాదీఖానా నిర్మాణానికి ఆది శ్రీనివాస్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న షాదీఖానా నిర్మాణానికి రూ.80 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒకవేళ ఈ నిధులు సరిపోకపోతే అదనపు నిధులు మంజూరు చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. గత పాలకులు కేవలం ప్రొసీడింగ్స్ ఇచ్చి పనులు చేయకుండా కాలయాపన చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం మాట ఇస్తే తప్పకుండా అమలు చేస్తుందని స్పష్టం చేశారు.గత రెండు సంవత్సరాల కాలంలోనే వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.1000 కోట్ల నిధులు తీసుకువచ్చామని, ఇది చరిత్రాత్మకమని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ అహ్మద్ పాషా, ముస్లిం కమిటీ కోశాధికారి ముషాహిద్,కాంగ్రెస్ నాయకులు పీర్ మహమ్మద్, అబ్దుల్ రజాక్, షేక్ సాబీర్, బాబూన్ మహమ్మద్ వలి, సయ్యద్ సాబీర్, ఇఫ్తాఖార్ హుస్సేన్, షేక్ ఇంతియాజ్, సోహెల్ ఖాన్, మసీదు అధ్యక్షులు నవాబ్ ఖాన్, షేక్ ఇమామ్, సర్వర్ పాషా, మహమ్మద్ బషీర్, అబ్దుల్ కరీం. ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# పసిపిల్లల వెన్నుపై పుస్తకాల బ్యాగు బరువులు

**– హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఏఎస్ శ్రీనివాస్**

**కరపత్రం ప్రతినిధి–హైదరాబాద్:**

వాస్తవానికి పిల్లల శరీర బరువులు 10 శాతం మాత్రమే పుస్తకాల బ్యాగు బరువు ఉండాలి అనే సిఫార్సు గాలికి పోయింది పరిమితికి మించి రెండింతలకు పైగా బ్యాగులు ఉండడంతో ఆన్లైన్లో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు ఆగ్రహానికి గురి అవుతున్నారని, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ సంయుక్త కార్యదర్శి, డాక్టర్ ఏ.ఎస్. శ్రీనివాస్ అన్నారు సోమవారం నాడు పత్రికల వారితో మాట్లాడుతూ దేశమంతటా చిన్న పిల్లలు మోస్తున్న భారీ స్కూల్ బ్యాగుల మోత ఆందోళనకు కేంద్ర బిందువుగా మారింది అన్నారు. పసి వెన్నులపై మోపుతున్న పుస్తకాల భారం వలన సర్వత్ర ఆగ్రహం వ్యక్తం అవుతుందని అన్నారు. పాఠాలు మొదలుకోకముందే తరగతి గదులు కూడా తెరవకుండా విద్యార్థులకు హాని చేస్తున్నాయా ? అని అనుమానం వ్యక్తం అవుతుందని అన్నారు.

**ఒక తండ్రి సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ తో హల్చల్..**

మహారాష్ట్రలోని ఒక తండ్రి తన కుమారుడి బ్యాగు బరువు తూచి దానిని



సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఈ చర్చ ప్రారంభమైందని ఈ ఘటనతో పిల్లల శారీరక ఆరోగ్యం పై చాలా కాలం నుంచి ఉన్న ఆందోళనలు మరొకసారి పెల్లుభికాయని అన్నారు. రాష్ట్రంలోని అర్బన్ సెమీ అర్బన్ ప్రాంతాలలో ఇప్పుడు సాధారణంగా మారిన బ్యాక్ ప్యాక్ లు తల్లిదండ్రుల కళ్ళ ముందు భారంగా కదులుతున్నాయి అన్నారు. అవసరం లేకపోయినా అనేక అంశాలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు నోటుబుక్కులు నీటి బాటిళ్ళు లంచ్ బాక్స్ తో పాటు కొన్నిసార్లు క్రీడా సామాగ్రి కూడా ప్రతిరోజు మూసుకు వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడిందని చాలా పాఠశాలలు ఇప్పటికీ కఠినమైన షెడ్యూల్ అనుసరిస్తూ వెళుతున్నారే కానీ టైం టేబుల్ ను ఈ షెడ్యూల్ తో సమన్వయం చేయలేకపోతున్నారని కనీసం తేలికైన ప్రత్యామ్నాయలను ప్రోత్సహించడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారని అన్నారు.

**పిల్లల ఎదుగుదల పై పెను మార్పులు..**

పసిపిల్లల భుజాలపై వేలాడే పుస్తకాల భారం కేవలం అసౌకర్యం మాత్రమే కాదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారని అన్నారు దీర్ఘకాలంలో ఈ పుస్తకాల బ్యాగు భారాన్ని మోయడం వల్ల శరీర భంగిమలో అసమతౌల్యత వెన్నుముకపై ఒత్తిడి వెన్ను నొప్పితో పాటు ప్రారంభ దశలోనే కండరాలు ఎముకలకు సంబంధించిన సమస్యలు తలెత్తవచ్చని పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ వైద్యులు హెచ్చరిస్తున్నారని ముఖ్యంగా ఎముకలు ఇంకా అభివృద్ధి చెందుతున్న పిల్లల్లో అలసట ఏకాగ్రత తగ్గిపోవడం పాఠశాలకు వెళ్లాలని ఆసక్తి తగ్గడం వంటి పరోక్ష ప్రభావాలు ఉంటాయని అన్నారు.

**ఎన్ సి పి సి ఆర్ రూల్స్ అమలులో లోపం..**

దేశంలో ఇప్పటికే ఈ సమస్యపై పలు మార్గదర్శకాలు అమల్లో ఉన్నాయని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ( ఎన్ సి పి సి ఆర్ ) తో పాటు పలు రాష్ట్రాల విద్యాశాఖలు స్కూల్ బ్యాగుల బరువుపై పరిమితులు విధించాలని విడతల వారీగా టైంటేబుల్ను అమలు చేయాలని పలుమార్లు సిఫార్సు చేశాయి అయినప్పటికీ ఈ మార్గదర్శకాలు అమలు చేయడంలో లోపం కనబడుతుందని అన్నారు చాలా సందర్భాలలో ఈ బాధ్యతలు పాఠశాలలకే వదిలివేస్తున్నారని భారత విద్యా వ్యవస్థ పై శ్రీనివాస్ వ్యాఖ్యానిస్తూ వ్యవస్థ వారాన్ని తమ వెన్నుపై మోస్తున్నట్లుగా కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ పుస్తకాల తో మెరుగైన చదువు సాధ్యం అనే భావన మన వారిలో కలిగి ఉండడం దురదృష్టకరమని అన్నారు. ఈ పాఠ్యపుస్తకాల భారం నేరుగా శారీరక భారంగా మారుతుందని డిజిటల్ పుస్తకాలు లాకర్ సదుపాయాలు వారంలో వివిధ పాఠ్యాంశాలను రొటేషన్ గా మార్చడం పరిమితంగా హోంవర్క్ వంటి పరిష్కారాలు సూచిస్తున్నప్పటికీ అవి అమలు కావడం కాలేదని మళ్లీ మన విద్యార్థులు భారమైన బ్యాగులతో ఇబ్బంది పడుతున్నారని ఈ దృశ్యాలు కళ్ళ ముందు కనబడుతున్న వేళ విద్యాభారం కావాలా లేక తల్లిదండ్రులు భయపడుతున్నట్లుగా లేలేత భుజాలపై ఉన్న ఈ బరువు ఇక మరింత పెరగకుండా తేలిక చేయాలా అనే ప్రశ్న ఉదయిస్తుందని అన్నారు.

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు అయ్యప్ప ప్రసాదం అందించిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్ జనవరి 17**

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ రాజకీయంగా మరో విశేష ఘట్టానికి వేదికైంది. మాజీ శాసన సభ్యులు, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కోరుకంటి చందర్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అయ్యప్ప స్వామి ప్రసాదాన్ని అందజేశారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ భేటీ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.

ఈ సందర్భంగా కోరుకంటి చందర్ మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి అనంత కృపతో బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) కు సంపూర్ణ ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర రాజకీయాల్లో యువ నాయకుడిగా విశేష గుర్తింపు పొందిన కేటీఆర్ అన్న నాయకత్వం మరింత



బలపడాలని, పార్టీని ప్రజల మధ్య మరింత దగ్గర చేయాలని అయ్యప్ప స్వామిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. అయ్యప్ప స్వామి దీవెనలతో కేసీఆర్-- కేటీఆర్ అన్నల నేతృత్వంలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బలమైన, స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటు కావాలని ఆకాంక్షించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో అమలైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో మేలు చేశాయని గుర్తు చేశారు. రైతులు, కార్మికులు, మహిళలు, యువత, పేద వర్గాలకు బీఆర్ఎస్ పాలనలో లభించిన భరోసాను ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదని తెలిపారు.

తెలంగాణ ఉద్యమం నుంచి రాష్ట్ర సాధన వరకు, ఆ తర్వాత అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని ముందుకు నడిపించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని, ఆ ఆశయాలను కేటీఆర్ అన్న మరింత ముందుకు తీసుకెళు తున్నారని కొనియాడారు. మౌలిక సదుపాయాలు, పరిశ్రమల అభివృద్ధి, ఐటీ రంగ విస్తరణ, గ్రామీణ--పట్టణ సమగ్ర అభివృద్ధి వంటి అంశాల్లో బీఆర్ఎస్ స్పష్టమైన దృక్పథంతో ముందుకెళ్తోందని పేర్కొన్నారు.

ఈ భేటీలో పార్టీ భవిష్యత్తుపై చర్చ జరగగా, రాబోయే రాజకీయ పోరాటాలకు పార్టీని మరింత బలోపేతం చేయాలనే సంకల్పం వ్యక్తమైంది. జిల్లాల స్థాయిలో పార్టీని క్షేత్రస్థాయికి తీసుకెళ్లి ప్రజల సమస్యలపై గట్టిగా పోరాడాలని, కార్యకర్తలకు అండగా నిలవాలని కేటీఆర్ సూచించినట్లు సమాచారం. పార్టీ శ్రేణులు క్రమశిక్షణతో, ఐక్యతతో పనిచేస్తే తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వ ఏర్పాటు ఖాయమని విశ్వాసం వ్యక్తమైంది.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్ప స్వామి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. అయ్యప్ప స్వామి ఆశీర్వాదాలతో బీఆర్ఎస్‌కు రాజకీయంగా కొత్త శక్తి, ప్రజల ఆశీర్వాదం లభించాలని, తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ జెండా ఎగరాలని అందరూ ఏకగ్రీవంగా ఆకాంక్షించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కీలక ముందడుగు

**– రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**
**– ఎన్నికల సంఘానికి అందనున్న రిజర్వేషన్ల జాబితా**

తెలంగాణలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. 10 మున్సిపల్ కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలకు సంబంధించిన రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. శనివారం సాయంత్రానికి మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్ల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కానుంది. రాత్రికి లేదాఆదివారం ఉదయానికి రాష్ట్ర ఎన్నికల సంఘానికి రిజర్వేషన్ల జాబితా అందజేసే అవకాశం ఉంది. ప్రభుత్వం జీవో ఇచ్చిన వెంటనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసేందుకు ఎస్ఈసీ సిద్ధంగా ఉంది. ఒకటి, రెండు రోజుల్లోనే మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. 10 కార్పొరేషన్లలో ఎస్సీ-1, ఎస్టీ-1, బీసీ-3(ఒకటి మహిళ)లకు కేటాయించారు. జనరల్ కేటగిరీలో ఐదు స్థానాలకు గానూ ఏకంగా నాలుగు స్థానాలను మహిళలకు కేటాయించారు. 121 మున్సిపాలిటీల్లో ఎస్సీ-17, ఎస్టీ-5, బీసీ-38, జనరల్-61 కేటాయించడం జరిగింది.కార్పొరేషన్ల వారీగా రిజర్వేషన్లు... ఇలా ఉన్నాయి. కొత్తగూడెం కార్పొరేషన్ - ఎస్టీ (జనరల్),రామగుండం కార్పొరేషన్- ఎస్సీ (జనరల్),మహబూబ్‌నగర్ కార్పొరేషన్- బీసీ మహిళ, మంచిర్యాల కార్పొరేషన్- బీసీ (జనరల్), కరీంనగర్ కార్పొరేషన్ - బీసీ (జనరల్), ఖమ్మం కార్పొరేషన్- మహిళ (జనరల్), నిజామాబాద్ కార్పొరేషన్- మహిళ (జనరల్), వరంగల్ కార్పొరేషన్- జనరల్, జీహెచ్ఎంసీ - మహిళ (జనరల్) నల్లగొండ కార్పొరేషన్- మహిళ (జనరల్) కు కేటాయించారు.